క్లుప్తంగా

రజకుల విశ్రాంతి భవనం సిద్ధం



త్యాజంపూడిలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న రజకుల విశ్రాంతి భవనం

దేవరపల్లి: మండలంలోని త్యాజంపూడి గ్రామ రజలకు చిరకాల కోరిక నెరవేరింది. కుల వృత్తి చెరువు వద్ద విశ్రాంతి భవనం లేకపోవడంతో వేసవి, వర్షాకాలాల్లో ఇబ్బందులు పడేవారు. తమ ఇబ్బందులను సర్పంచ్ కుసులూరి స్వరూపరాణి, ఉప సర్పంచ్ కుసులూరి వెంకట సతీష్ ద్వారా ఎంపీపీ కేవీకే దుర్గారావుకు వివరించారు. విశ్రాంతి భవనం నిర్మాణానికి సుమారు రూ.9 లక్షల మండల పరిషత్ నిధులు మంజూరు చేయగా, భవన నిర్మాణం పూర్తి చేసినట్టు ఉప సర్పంచ్ వెంకట సతీష్ తెలిపారు. నిధులు మంజూరు చేసిన ఎంపీపీ దుర్గారావు, సర్పంచ్, ఉప సర్పంచ్‌కు రజకులు కృతజ్ఞతలు తెలిపారు.

దోమ తెరల పంపిణీ



దోమ తెరలు పంపిణీ చేస్తున్న హరిప్రసాద్, రొటేరియన్లు

నిడదవోలు: రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం బాలింతలకు పౌష్టికాహారం, నవజాత శిశువులకు బెడ్ షీట్లు, దోమ తెరలు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు మీసాల హరిప్రసాద్ భార్య దుర్గాంబ జ్ఞాపకార్థం కుమారుడు మీసాల కాశీబాబు ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మీసాల హరిప్రసాద్, దారపురెడ్డి ప్రతాప్, గుంటిపల్లి సత్యసాయి, ఉప్పులూరి రామ్మోహన్‌రావు, ఈరిశెట్టి రాజగోపాల స్వామి, గుంటిపల్లి శివ, గాజుల రంగారావు, ఎండీ ఫయాజ్, గోపిరెడ్డి శ్రీనివాస్, సానెపు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి ఉండాలి



చాగల్లులో పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

చాగల్లు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపైనా ఆసక్తి పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రమైన చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాష్ట్ర స్థాయి జూనియర్ బాల బాలికల మిక్స్‌డ్ టార్గెట్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, మండల కేంద్రాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేస్తామన్నారు. కొవ్వూరులో నిర్మాణంలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. శాప్ డైరెక్టర్ పి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ, ప్రతి పాఠశాలకు క్రీడా సామగ్రి అందజేయడానికి రూ.30 వేల వంతున కేటాయించామన్నారు. త్వరలోనే క్రీడా సామగ్రిని పాఠశాలలకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, హెచ్‌ఎం వాసవి, వ్యాయమ ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

బీజేపీ వైఖరిపై కాంగ్రెస్ నేతల నిరసన



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

నిడదవోలు: అధికారం చేపట్టడానికి బీజేపీ అప్రజాస్వామిక విధానాలను అవలంబించిందని ఆరోపిస్తూ, ఎన్‌డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పట్టణంలోని చర్చిపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ మేడవరపు భద్రం దొర మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం, ఎన్‌డీఏ ప్రభుత్వం కుమ్మక్కై, రాజ్యాంగాన్ని అవమానపరిచేలా అప్రజాస్వామికంగా బీజేపీ అధికారం చేపట్టిందని విమర్శించారు. దేశంపై ఏ మాత్రం గౌరవం లేని నరేంద్రమోదీ తక్షణమే రాజీనామా చేసి, దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చిన్నం మురళీకృష్ణ, అగర్వాల్ హీరాలాల్, భావన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రం అందజేత

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్ మందాలపు నాగలక్ష్మి మృతి చెందిన నేపథ్యంలో ఆమె భర్త పండెం నాగబాబుకు జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆయనకు కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి కారుణ్య నియామక పత్రం అందజేశారు.

వరాలు కురిపించి.. కరుణించవమ్మా..

- ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు
- భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీదేవి వ్రతాలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



బ్రాహ్మణగూడెంలో ప్రత్యేకాలంకరణలో అమ్మవారు



ఖండవల్లిలో కనకదుర్గమ్మ అమ్మవారు



తాళ్లపూడిలో రాజ్యలక్ష్మీ అమ్మవారు



తాళ్లపూడిలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



ఖండవల్లిలోని ఆలయంలో వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళలు

చాగల్లు: శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మండలంలో అమ్మవారి ఆలయాలు మహిళలతో కిక్కిరిశాయి. చాగల్లు వల్లికుంటలోని కనకదుర్గమ్మ ఆలయంలోను, ధనలక్ష్మమ్మ ఆలయంలోను, ఊనగట్ల, బ్రాహ్మణగూడెం, మార్కొండపాడు, చిక్కాల, చంద్రవరం తదితర గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవార్లను గౌరీమాతగా పట్టువస్త్రాలు, పూలమాలలతో అలంకరించారు. లలితా సహస్రనామాలు, విష్ణు సహస్రనామాలు, భగవద్గీత పారాయణం, శివసహస్రనామాలు, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. చాగల్లు కనకదుర్గమ్మ ఆలయంలోను కుంకుమ పూజలు, అభిషేకాలు జరిగాయి. శ్రావణ మాసం శుక్రవారం కావడంతో మహిళలు ఇళ్ల వద్ద వరలక్ష్మీ వ్రతాలు, పూజలు నిర్వహించారు. నోములు నోచుకుని, ముత్తయిదువులకు వాయినాలు ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో వ్రతాలు

తాళ్లపూడి: సౌభాగ్యాన్ని కలుగజేయాలని, సిరులు కురిపించాలని కోరుతూ మహిళలు శ్రావణ శుక్రవారం వరలక్ష్మీదేవి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ రకరకాల పిండి వంటలతో, పండ్లు, పూలు, పత్రులతో లక్ష్మీదేవిని పూజించారు. కొత్త పెళ్లి కూతుళ్లు, ఇతర మహిళలు శ్రావణ శుక్రవార వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు. గోదావరిలో స్నాన మాచరించి, ఉపవాసంతో 12 రకాల పిండి వంటకాలను లక్ష్మీదేవికి నైవేద్యంగా సమర్పించారు. ముత్తయిదువులకు వాయినాలు, పసుపు కుంకుమలను అందజేసి ఆశీస్సులు పొందారు. మండలంలోని అమ్మవారి ఆలయాలు మహిళలతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు తాళ్లపూడిలోని రాజ్యలక్ష్మీ ఆలయంలో, శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో, మలకపల్లి కనకదుర్గమ్మ ఆలయంలో అధిక సంఖ్యలో భక్తులు పూజలు నిర్వహించారు. వేగేశ్వరపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద అర్చకుడు పెరవలి ప్రసాద్ ఆధ్వర్యంలో, తాళ్లపూడి రాజ్యలక్ష్మీదేవి ఆలయంలో అర్చకుడు గోవర్ధనం చక్రవర్తి ఆధ్వర్యంలో అమ్మవారిని పుష్పాలతో అలంకరించి, పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇళ్ల వద్ద వ్రతాలు

తాళ్లపూడి(కొవ్వూరు): కొవ్వూరులో శుక్రవారం మహిళలు ఇళ్ల వద్ద వరలక్ష్మీదేవి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రసాదాలను సమర్పించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారి ఆలయాలు మహిళలు, భక్తులతో కిటకిటలాడాయి. అధిక సంఖ్యలో మహిళలు ఆలయాల్లో పూజలు చేశారు. స్థానిక గోష్పాద క్షేత్రంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలోను, మెరకవీధి కనకదుర్గమ్మ ఆలయంలోను, కొవ్వూరమ్మ ఆలయంలోను, కుమారదేవం గండిపోశమ్మ ఆలయంలో, సీతంపేట, పంగిడి, పశివేదల అమ్మవారి ఆలయాల్లో అమ్మవార్లకు పూజలు నిర్వహించి, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ఆలయాల కిటకిట

పెరవలి: వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మండలంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఖండవల్లి, కాకరపర్రు, కానూరు, తీపర్రు గ్రామాల్లోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఇళ్ల వద్ద నిర్వహించుకునే ఈ వ్రతంలో మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో తొమ్మిది రకాల పిండివంటలతో, వివిధ రకాల పూలతో అమ్మవారి చిత్రపటాలను అలంకరించి, పూజలు నిర్వహించారు. ప్రతి ఇంటి వద్ద అమ్మవారి నామ స్మరణతో గ్రామాలు మారుమోగాయి.

ఆధ్యాత్మిక శోభ

నిడదవోలు రూరల్: వరలక్ష్మీ వ్రతం సందర్భంగా నిడదవోలు మండలంలోని గ్రామాల్లో లోగిళ్లు ఆధ్యాత్మిక శోభతో సందడిగా మారాయి. తెల్లవారుజాము నుంచే మహిళలు వరలక్ష్మీ వ్రతం, శ్రావణ శుక్రవారం పూజలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణమాసంలో ఇంటి వద్ద లక్ష్మీదేవి వ్రతం ఆచరిస్తే సిరి సంపదలు కలుగుతాయన్నది భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో భక్తులు తమ ఇంట సిరులు పండించాలని, సకల సౌభాగ్యాలు ప్రసాదించాలంటూ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తిమ్మరాజుపాలెం గ్రామంలోని కోట సత్తెమ్మ వారి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు, హోమాలు నిర్వహించారు. కోట సత్తెమ్మ, కాటకోటేశ్వరం శివాలయంలో ఉమాపార్వతీదేవిని ప్రత్యేకంగా పుష్పాలంకరణ చేశారు. మహిళలు పగలు ఉపవాసం ఉండి, నోములు నోచారు. ముత్తయిదువులకు వాయినాలు ఇచ్చి సత్కరించారు.

'ధన' కనకదుర్గమ్మ



పాలంగిలో కరెన్సీ నోట్ల అలంకరణలో ఉన్న కనకదుర్గమ్మ వారు

ఉండ్రాజవరం: శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం కావడంతో మండలంలోని అమ్మవార్ల ఆలయాలు సందడిగా కనిపించాయి. తెల్లవారుజాము నుంచి ఇళ్లల్లో వ్రతాలు ఆచరించిన మహిళలు.. అనంతరం అమ్మవారి దర్శనానికి ఆలయాల వద్ద బారులు తీరారు. పాలంగిలో కనకదుర్గమ్మ అమ్మవారు ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దాతల సహకారంతో సుమారు రూ.4.5లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. అర్చకుడు చక్రవర్తుల లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. తణుకు, ఉండ్రాజవరం మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మోర్త, ఉండ్రాజవరం, కె.సావారం, చివటం తదితర గ్రామాల్లోని కనకదుర్గమ్మ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అమ్మవారికి మహిళలు క్షీరాన్నం, కుడుములు, గారెలు నైవేద్యంగా సమర్పించారు.

మాజీ హోం మంత్రి వనిత పర్యటన



యాదవోలులో హారిక జ్యోతిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి తానేటి వనిత

దేవరపల్లి: రాష్ట్ర మాజీ హోం శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు తానేటి వనిత శుక్రవారం మండలంలో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తల పరామర్శ, నూతన గృహ ప్రవేశ కార్యక్రమాలకు హాజరయ్యారు. యాదవోలులో పార్టీ కార్యకర్త కుప్పాల అయ్యప్ప నూతన గృహాన్ని తానేటి వనిత ప్రారంభించారు. అనంతరం అనారోగ్యంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఎంపీటీసీ సభ్యురాలు కుమారపు హారిక జ్యోతిని పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్ సున్నం వరప్రసాద్, ఉప సర్పంచ్, పార్టీ జిల్లా నాయకుడు ఆరేటి సూర్యనారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎలికే నాగశ్రీను, నియోజకవర్గ మైనార్టీ విభాగం అధ్యక్షుడు షేక్ ముస్తఫా, నాయకులు తమ్మిరెడ్డి నాగేశ్వరరావు, అనిశెట్టి సూర్యచంద్రం తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

రికార్డుల్లేని 23 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



జగనన్న కాలనీవాసులతో మాట్లాడుతున్న సీఐ తిలక్

నిడదవోలు: శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక శక్తుల కార్యకలాపాలను అణిచివేసేందుకు పట్టణంలోని జగనన్న కాలనీలో శుక్రవారం వేకువజామున నిడదవోలు సీఐ పీవీజీ తిలక్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాలతో పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది సంయుక్తంగా ఇంటింటా తనిఖీలు చేపట్టారు. మద్యం, సారా, గంజాయి, మందుగుండు సామగ్రి, అక్రమ నిల్వలపై క్షుణ్ణంగా సోదాలు చేశారు. ఈ సోదాల్లో రికార్డులు లేని 23 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో సీఐ తిలక్ మాట్లాడుతూ, సమస్యాత్మక ప్రాంతాల్లో ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న నేరగాళ్లు తమ కార్యకలాపాలను మానుకోవాలని సూచించారు. అనుమానితుల కదలికలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులను ఉపేక్షించబోమని, అటువంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి సేవనం, విక్రయాలు, రవాణా చేసే వారిపై పూర్తి స్థాయిలో నిఘా పెట్టామన్నారు. కొందరు కేటుగాళ్లు యువతకు గంజాయి అలవాటు చేస్తున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తుపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను నిబంధనలకు లోబడి, అవాంఛనీయ సంఘటనలు లేకుండా నిర్వహించుకోవాలన్నారు. జగనన్న కాలనీలో ఐదు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్సైలు జగన్‌మోహన్‌రావు, బాలాజీ, రవికుమార్, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, ట్రైనీ ఎస్సై కల్పన, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియులకు రక్షణ కల్పించాలి



తాళ్లపూడిలో మాట్లాడుతున్న సంఘ ప్రతినిధులు

తాళ్లపూడి: దుండగుల బారి నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరుతూ తాళ్లపూడి, పోలవరం, పట్టిసీమ, కొవ్వూరు మండలాల అగ్నికుల క్షత్రియ సంఘాల ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆయా సంఘాల ప్రతినిధులు మల్లాడి పోసియ్య, మచ్చా సూరిబాబు, రెవి చిన్నా, లంకె ప్రకాశం, పెమ్మాడి పోసియ్య, పొన్నాడ అన్నవరం తదితరులు తమ సమస్యలు వివరించారు. గోదావరి నది వెంబడి కొవ్వూరు, తాళ్లపూడి, పోలవరం మండలాలకు చెందిన అగ్నికుల క్షత్రియులు నదీ తీరం వెంబడి గ్రామాల పరిధిలో చేపల వేట సాగిస్తుంటారన్నారు. వరదల సమయంలో నిషేధాజ్ఞలు ఉన్నపుడు కూడా యానాం నుంచి వచ్చిన కొంత మంది తమతో గొడవపడి మరీ ప్రమాదకరమైన బ్యారేజ్ ప్రాంతంలో కూడా వేటకు వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. అందువల్ల అధికారులు నిషేధాజ్ఞలు కఠినంగా అమలు చేయాలని కోరారు. అలాగే అక్రమంగా వేటకు వెళ్లే వారిపై, దాడులు జరిపే వారిపై చట్టరీత్యా మత్స్య, పోలీస్ శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ధర్మకర్తల మండలి ఏర్పాటుకు నోటిఫికేషన్

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెం గ్రామంలో ఉన్న కోట సత్తెమ్మ అమ్మవారి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్య ప్రకాష్ శుక్రవారం తెలిపారు. దేవదాయ, ధర్మాదాయ చట్టం ప్రకారం ధర్మకర్తల మండలి సభ్యుల నియామకానికి అర్హులైన అభ్యర్థులు 20 రోజుల్లోపు దరఖాస్తులను అమ్మవారి దేవస్థానంలో అందించాలని చెప్పారు. నోటిఫికేషన్‌కు సంబంధించి ఇతర వివరాలకు 73826 08577 నంబరుకు సంప్రదించాలన్నారు.

వేద పండితుని నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరవలి: మండలంలోని అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేద పండితుడిగా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆర్థిక సాయంతో నెలకు రూ.22 వేల చొప్పున ఇస్తారని చెప్పారు. శుక్లయజుర్వేదం కానీ, కృష్ణ యజుర్వేదం కానీ వచ్చిన వారు అర్చకులుగా చేసేందుకు అర్హులని తెలిపారు. ఈ నెల 28వ తేదీలోపు తిరుమల తిరుపతి దేవస్థానానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో మార్పు

నిడదవోలు రూరల్: కాటకోటేశ్వరం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం శనివారం విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు చేసినట్టు ఏపీఈపీడీసీఎల్ నిడదవోలు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు శుక్రవారం తెలిపారు. తిమ్మరాజుపాలెం, రావిమెట్ల, నిడదవోలు, శంకరాపురం గ్రామాల్లో ఉదయం నాలుగు నుంచి ఎనిమిది గంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఐదు గంటల వరకు త్రీఫేజ్ సరఫరా చేస్తామన్నారు.

కలెక్టర్ క్షేత్ర స్థాయి పర్యటన



ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: పింఛన్ పంపిణీ తీరును పరిశీలించేందుకు కలెక్టర్, కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి శనివారం స్థానిక 49వ వార్డులో పర్యటించారు. అక్కడి ప్రజలతో మాట్లాడి, వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ప్రజలతో మమేకమై పనిచేయాలని, వారికి సేవలందించడానికి ప్రాధాన్యం ఇవ్వాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా తల్లికి వందనం, పింఛన్, రేషన్ కార్డులు, ఇంటి స్థలాలు మొదలైన పథకాలు అందలేదంటూ పలువురు ప్రజలు తెలిపారు. ఆయా ఫిర్యాదులను తక్షణమే స్వీకరించి, వాటి యథార్థ స్థితిని పరిశీలించి నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆమె వెంట ఆర్‌ఎంసి అధికారి శైలజావల్లి, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి, పీడీవోలు పాల్గొన్నారు.

రక్షానుబంధం

- అనురాగాలకు అంతరాలు లేని సంబంధం
- మార్కెట్లో రాఖీల కొనుగోళ్ల సందడి
- ఆకట్టుకుంటున్న వివిధ ఆకృతులు
- నేడు రాఖీ పౌర్ణమి



తాళ్లపూడిలో మార్కెట్లో అందుబాటులో ఉన్న రాఖీలు

తాళ్లపూడి: సోదర సోదరీమణుల ప్రేమానురాగాలు, అనుబంధాలకు ప్రతీకగా జరుపుకొనేదే రాఖీ పండగ. బుడిబుడి అడుగుల లేత ప్రాయం నుంచి, ప్రాణం ఉన్నంత వరకూ ప్రేమాభిమానాలతో సాగేదే రక్త సంబంధం. శనివారం రాఖీ పౌర్ణమి కావడంతో నియోజకవర్గంలోని కొవ్వూరు, తాళ్లపూడి మార్కెట్లో వివిధ రకాల రాఖీలు విక్రయిస్తున్నారు. వీటిని కొనుగోలు చేయడానికి అక్కాచెల్లెళ్లు పెద్ద సంఖ్యలో రావడంతో సందడి నెలకొంది.

ప్రేమానురాగాల అనుబంధం

ఏటా శ్రావణ మాసంలో పౌర్ణమి రోజున రాఖీ పండగను జరుపుకొంటారు. అక్కలు, చెల్లెళ్లు తమ అన్నయ్య, తమ్ముళ్లకు అమితమైన, స్వచ్ఛమైన ప్రేమతో రాఖీ కడతారు. తన సోదరుడు ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటే, రక్షాబంధాన్ని స్వీకరించిన సోదరుడు తానెప్పుడూ కష్టసుఖాల్లో సోదరికి రక్షణగా ఉంటానని ఈ పండగ ద్వారా నిశ్చయించుకుంటాడు.

మానవ సంబంధాలు మెరుగు

ప్రస్తుతం మారుతున్న ఆధునిక పోకడల మధ్య సమాజంలో ఎన్నో మార్పులు చోటుచేసుకుని, వ్యక్తుల మధ్య స్వార్థం, అసూయ పెరిగిపోయాయి. అనుబంధాలు ఎండమావులుగా మారుతున్న నేటి ఆధునిక యుగంలో రాఖీ పర్వదినం అన్నాచెల్లెలు, అక్కాతమ్ముళ్ల అనుబంధాలను మరింత బలోపేతం చేస్తోంది. మానవ సంబంధాల మెరుగుదలకు, ఆత్మీయుల మధ్య అనుబంధానికి, ఐకమత్యానికి, పరస్పర సహకారానికి చిహ్నంగా రాఖీ పౌర్ణమి నిలుస్తుంది.

సోషల్ మీడియాతో..

అన్నింటా సోషల్ మీడియా రంగప్రవేశం చేయడంతో ప్రపంచం చిన్న కుగ్రామంగా మారిపోయింది. సమాచారం క్షణాల్లో చేరిపోతుంది. దూరప్రాంతాల్లో, విదేశాల్లో ఉన్న వారు సైతం కొరియర్‌లోనూ తమ వారికి రాఖీలు పంపుతూ అనుబంధాలను చాటి చెబుతున్నారు. ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

మార్కెట్లో రాఖీలకు డిమాండ్

వివిధ ఆకృతుల్లో తయారు చేసిన రాఖీలు మార్కెట్‌ను సందడి చేస్తున్నాయి. ఫొటోలతో సైతం రాఖీలను తయారు చేస్తున్నారు. అక్కాచెల్లెళ్లు తమ అన్నాతమ్ముళ్లకు రాఖీలు కట్టడానికి వీటిని కొనుగోలు చేస్తున్నారు. రూ.10 నుంచి వివిధ రకాలను బట్టి రూ.300 వరకు ధరలు పలుకుతున్నాయి. ఫొటో రాఖీలు, మగ్గులపై ముద్రించిన రాఖీలు ఈ ఏడాది ఆకట్టుకుంటున్నాయి. ఫొటో రాఖీలైతే ఆఫర్ పెట్టి రూ.499 నుంచి రూ.600 వరకు విక్రయిస్తున్నారు. మగ్గులైతే రూ.500కు విక్రయిస్తున్నారు. ఆకర్షణీయమైన మోడళ్లలో రాఖీలు తయారు చేశారు. ముత్యాలు, పూసలతో కళాత్మకంగా వీటిని రూపొందించారు.



తాళ్లపూడిలో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు



వివిధ రకాల ఆకృతుల్లో..



ప్రత్యేకమైన రాఖీ మగ్గులు